జగనన్న సురక్ష వరం

- సేవల్లో రెవెన్యూదే అగ్రస్థానం
- పెడన నియోజకవర్గంలో 30,257 దరఖాస్తుల పంపిణీ
- లబ్ధిదారుల హర్షాతిరేకాలు

పెడన: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అందించిన సేవల్లో రెవెన్యూ శాఖ అగ్రస్థానంలో నిలిచింది. నెలరోజుల పాటు నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమాల్లో అర్హులైన వారికి వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అందజేశారు. ఇది లబ్ధిదారులకు వరంగా మారింది. వాస్తవంగా అర్హులై ఉండి వారికి సంక్షేమ పథకాలు అందకుంటే వారితో కొత్తగా దరఖాస్తు చేయించి సంక్షేమ ఫలాలను అందించాలనే ప్రధాన లక్ష్యంతో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదాయ, కుల, ధ్రువీకరణ పత్రాలు, వివాహ రిజిస్ట్రేషన్, ఆధార్ నెంబరుకు ఫోన్ లింకు చేయడం, కౌలు రైతుల గుర్తింపు కార్డులు, రైస్‌కార్డులలో చేర్పులు, కొత్త రైస్‌కార్డులు, రైస్ కార్డులలో పేర్ల తొలగింపు ఇలా వివిధ రకాల సేవలను ఉచితంగా అందించడమే కాకుండా ఇంటింటికి వెళ్లి ఆయా ధ్రువీకరణ పత్రాలను స్వయంగా అందజేశారు.

ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు..

రెవెన్యూ శాఖ ద్వారా ఏదైనా ధ్రువీకరణ పత్రం పొందాలంటే మీ సేవా లేదా సచివాలయం ద్వారా దరఖాస్తు చేయాలి. ఇందుకు నిర్దేశించిన ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఆ తరువాత ధ్రువీకరణ పత్రం అందుకునేందుకు ఆలస్యమయ్యేది. అయితే నెల రోజులు పాటు జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలు ఉచితంగా ప్రభుత్వ సేవలను అందుకున్నారు. వలంటీర్లు ఇంటి వద్దకే వచ్చి ధ్రువీకరణ పత్రం కోసం అభ్యర్థనను రిజిస్టర్ చేసుకున్నారు. ప్రతి సచివాలయం పరిధిలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించి ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అందజేశారు.

30,257 దరఖాస్తుల పంపిణీ

పెడన నియోజకవర్గంలోని పెడన పట్టణంతో పాటు మండలం, గూడూరు, కృత్తివెన్ను, బంటుమిల్లి మండలాల్లోని లబ్ధిదారులకు 30,257 ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఇందులో కుల ధ్రువీకరణ పత్రాలు 14,532, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు 12,463, ఆధార్‌కు ఫోన్ నెంబరు లింకు చేసినవి 2,063, ఇతర దరఖాస్తులు 1,199 ఉన్నాయి.



జగనన్న సురక్ష శిబిరంలో ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న ఎంపీపీ వాణి (ఫైల్)

మండలం	కులం	ఆదాయం	ఆధార్	ఇతరములు	మొత్తం
పెడన అర్బన్	881	901	313	277	2,372
పెడన రూరల్	1,838	1,438	640	187	4,103
బంటుమిల్లి	2,075	1,891	490	271	4,727
కృత్తివెన్ను	3,242	3,011	102	51	6,406
గూడూరు	6,496	5,222	518	413	12,649
మొత్తం	14,532	12,463	2,063	1,199	30,257

ఇంటికే తీసుకువచ్చి ఇచ్చారు



నాకు ఇద్దరు కుమార్తెలు. వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నా. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా ఇస్తారని తెలిసింది. నా పిల్లలకు భవిష్యత్‌లో ఎటువంటి ఇబ్బందులు ఉండకూడదనే ఉద్దేశంతో వలంటీరును సంప్రదించి దరఖాస్తు చేశా. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను తీసుకున్నా. చాలా సంతోషంగా ఉంది. గతంలో కూడా వీటి కోసం దరఖాస్తు చేశా. అప్పుడు మండల కేంద్రానికి పోయి రోజుల తరబడి నిరీక్షించాల్సి వచ్చేది. ఇప్పుడా పరిస్థితి లేదు. ఇంటికే తీసుకువచ్చి ఇచ్చారు.

– చిన్నం జోసఫ్‌తంబి, పెనుమల్లి, పెడన మండలం

కుల ధ్రువీకరణ పత్రం తీసుకున్నా



జగనన్న సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకునేందుకు ధ్రువీకరణ పత్రం కావాల్సి వచ్చింది. జగనన్న సురక్ష ద్వారా ఉచితంగా ఇవ్వడమే కాకుండా ఇంటికి తీసుకువచ్చి ఇస్తారని తెలిసి వలంటీర్‌ను సంప్రదించా. సదరు వలంటీరు నా పేరు రిజిస్టర్ చేయడమే కాకుండా టోకెన్ ఇచ్చి కుల ధ్రువీకరణ పత్రం అందజేశారు. దీని ద్వారా జగనన్న తోడు పథకానికి దరఖాస్తు చేసుకునే అవకాశం వచ్చింది.

– కరీమున్నీసా, 6వ వార్డు, పెడన

ఉచితంగా అందించారు



మా వలంటీరు మాకు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అందించారు. భవిష్యత్‌లో ఇవి ఉపయోగపడతాయని, ఉచితంగా ఇస్తున్నారు తీసుకోవాలని చెప్పడంతో వలంటీరు మా మంచికే చెప్పారనే ఆలోచనతో దరఖాస్తు చేశాం. ఇంటికి తీసుకువచ్చి ఇచ్చారు. చాలా సంతోషంగా ఉంది. ఇంటికే వచ్చి సేవలందించడం చాలా ఆనందంగా ఉంది. సీఎం జగన్‌కు కృతజ్ఞతలు.

–ఉయ్యూరు సత్యనారాయణ, లలితాంబ, కాకర్లమూడి

క్లుప్తంగా

ప్రభుత్వ సాయాన్ని అందిపుచ్చుకోవాలి

న్యాయమూర్తి రామకృష్ణయ్య



చిలకలపూడి(మచిలీపట్నం): విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసించేందుకు ప్రభుత్వాలు అందిస్తున్న సాయాన్ని అందిపుచ్చుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణయ్య అన్నారు. ప్రభుత్వ లేడియాంప్తిల్ పాఠశాలలో శనివారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ ఉన్నత విద్య కోసం ప్రభుత్వాలు పలు పథకాలను అమలు చేస్తున్నాయన్నారు. ఈ పథకాల ద్వారా లబ్ధి చేకూరేందుకు దరఖాస్తు చేసుకుని ఉన్నత విద్యను అందిపుచ్చుకుని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ఈ పథకాల అమలులో ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా తమ సంస్థకు ఫిర్యాదు చేస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి అర్హులై ఉంటే తప్పనిసరిగా లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. జూనియర్ సివిల్ జడ్జి ఎల్. గోపీనాథ్, స్పెషల్ మొబైల్ కోర్టు న్యాయమూర్తి ఎం. వెంకట వాహిని, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె. శ్రావణి, ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వి. వెంకటేశ్వరరావు, ఎండీ దీపిక, ఏబీ అప్పారావు, పాఠశాల హెచ్‌ఎం. వై. వీరకుమారి, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ చీలి మునలయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

కోనేరుసెంటర్: పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కిట్టు అన్నారు. పోతేపల్లి పాఠశాలలోని 192 మంది విద్యార్థులకు గ్రామానికి చెందిన బడే రాజారావు కుటుంబ సభ్యుల సహకారంతో కిట్టు పుస్తకాలను పంపిణీ చేసి మాట్లాడారు. నోట్ పుస్తకాలను ఉచితంగా అందజేసిన బడే రాజారావు కుటుంబ సభ్యులను అభినందించారు. మాజీ ఎంపీటీసీలు నాగబాబు, కాగిత ఏడుకొండలు, ట్రేడ్ యూనియన్ మండల అధ్యక్షుడు నీలకంఠం వీరాంజనేయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

నాగాయలంక: డీవార్మింగ్‌కు సంబంధించి ప్రచార వాల్‌పోస్టర్లను శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగాయలంక, సొర్లగొంది, ఎదురుమొండి పీహెచ్‌సీల వైద్యాధికారులు డాక్టర్ వి. శివరామకృష్ణ, డాక్టర్ కె.శ్యామ్‌ప్రసాద్, డాక్టర్ ఫాతిమున్నీసా పాల్గొని డీవార్మింగ్ మాత్రలను ఎంపీడీఓ సీహెచ్ శ్రీనివాసరావు, ఎంఈఓ రామారావుకు అందజేశారు. వీటిని పాఠశాల విద్యార్థులకు అందజేయాలన్నారు.

సీసీ రహదారి పనులకు శంకుస్థాపన

ఘంటసాల(అవనిగడ్డ): ఘంటసాల మండల పరిధి తాడేపల్లి ఎస్సీ కాలనీలో సీసీ రహదారి పనులకు సర్పంచ్ పడమటి సీతామహాలక్ష్మి భూమి పూజ చేశారు. రూ.6 లక్షల గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో 117 మీటర్ల మేర సీసీ రహదారిని ఎస్సీ కాలనీలో నిర్మిస్తున్నారు. ఈ కాలనీలో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు పర్యటించినపుడు రహదారి సమస్యను ఆయన దృష్టికి తీసుకురాగా నిధులు మంజూరు చేశారు. ఏఎంసీ చైర్మన్ వేమూరి వెంకట్రావ్ పనులను పర్యవేక్షించగా, ఎంపీటీసీ కొల్లూరి విజయ, పీఏసీఎస్ చైర్‌పర్సన్ తాతినేని కృష్ణారావు పాల్గొన్నారు.

డ్రెయినేజీపై ఆక్రమణలు తొలగించాలి

చల్లపల్లి: డ్రెయినేజీపై ఏర్పాటు చేసిన అన్ని ఆక్రమణలను ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా తొలగించాలని పంచాయతీ ఈఓ పేర్ని మాధవేంద్రరావు అన్నారు. స్థానిక బందరు రోడ్డులో దుకాణదారులు డ్రెయినేజీ ఆక్రమించి రోడ్డు మార్జిన్ వరకు ఏర్పాటు చేసిన ఇనుప చువ్వల గుట్టలు, వాసం కట్టలు, బోర్డులు, సరుకులు, ప్రదర్శన సరుకును పరిశీలించి తొలగించాలని స్పష్టంచేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ కలతోటి సుధాకర్, పంచాయతీ సిబ్బంది, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెన్షనర్ల సేవా భావం అభినందనీయం

కోనేరుసెంటర్: మృతుల కుటుంబాలకు పెన్షనర్లు ఆర్థిక సహాయం అందజేయడం అభినందనీయమని ఎస్ఎన్ గొల్లపాలెం మాజీ సర్పంచ్ మట్టా మోహన నాంచారయ్య అన్నారు. ఎస్ఎన్ గొల్లపాలెం గ్రామానికి చెందిన పెన్షన్‌దారులు అంకం రేణుక, కనపర్తి మాణిక్యాలరావు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. గ్రామంలోని తోటి పెన్షన్‌దారులు ఒక్కొక్కరు రూ. 100 చొప్పున సేకరించిన రూ. 60,900 నగదును మృతుల కుటుంబ సభ్యులకు అందజేశారు. సచివాలయ కన్వీనర్లు చోరగుడి రామచంద్రరావు, గణేశన వెంకటేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

మోపిదేవి: ఏపీఎన్‌జీఓ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 21, 22 తేదీల్లో విజయవాడలో నిర్వహించనున్న 21వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని చల్లపల్లి యూనిట్ అసోసియేషన్ అధ్యక్షుడు పి. సుధాకర్ కోరారు. మోపిదేవి ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో శనివారం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. ఉపాధ్యక్షుడు నందం బాబూరావు, కోశాధికారి బి. విజయ్‌కుమార్, కార్యదర్శి కుక్కల రాజేంద్రప్రసాద్, జాయింట్ కార్యదర్శి జి. రాంబాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ

గూడూరు: రైల్వే బోర్డు సభ్యుడు మోటేపల్లి రత్నారావు ఆధ్వర్యంలో గూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్లేట్లను అందజేశారు. 1986–87 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులతో కలిసి పాఠశాల విద్యార్థులకు అవసరమైన 240 స్టీల్ పేట్లను శనివారం ఆయన పంపిణీ చేశారు. పాఠశాల హెచ్‌ఎం డి.పుష్పలత, పేరెంట్స్ కమిటీ చైర్మన్ కొల్లు వాసు, డొక్కు నాని, పీఈటీ మత్తి అరుణ తదితరులు పాల్గొన్నారు.

బీఎల్‌ఓలకు షోకాజ్ నోటీసులు

గూడూరు: పెడన ఎన్నికల అధికారి శనివారం నిర్వహించిన జూమ్ కాన్ఫరెన్స్‌కు గైర్హాజరైన బీఎల్‌ఓలకు తహసీల్దార్ బి.విజయప్రసాద్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. శనివారం మధ్యాహ్నం మూడు గంటలకు జూమ్ సమావేశం నిర్వహించగా మండలంలోని 16 మంది బీఎల్‌ఓలు హాజరుకాలేదు. గైర్హాజరుకు కారణాలను 24 గంటల్లోగా తెలియజేయాలని తహసీల్దార్ ఆదేశించారు.

సిమెంట్ రోడ్డు, పక్కా డ్రెయిన్ పనులు ప్రారంభం

మచిలీపట్నంటౌన్: 49 వ డివిజన్‌లో సిమెంట్ రోడ్లు, పక్కా డ్రెయిన్ నిర్మాణ పనులను మాజీ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్ శీలం భారతితో కలిసి శనివారం ప్రారంభించారు. గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ. 20 లక్షలతో నాలుగు సిమెంట్ రోడ్లు, పక్కా డ్రెయిన్, 8 విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనులను శనివారం వారు ప్రారంభించారు. వెంకటేశ్వరమ్మ, భారతి మాట్లాడుతూ నగరంలోని పలు డివిజన్లలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. దీంతో ఆయా డివిజన్లలో మౌలిక వసతులు ఏర్పడి ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. కార్పొరేటర్ పల్లిశేఖర్, పలు డివిజన్ల కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా పథకాలు

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

కోడూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హతే ప్రామాణికంగా ప్రతిఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. శనివారం మండలంలోని విశ్వనాథపల్లి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని రమేష్‌బాబు, యువ నేత వికాస్ నిర్వహించారు. గ్రామంలోని 566 ఇళ్లకు వెళ్లి సమస్యలు తెలుసుకుని ప్రభుత్వ పథకాలను వివరించారు. ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలిచిందని, కుల మతాలు, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా చేసుకొని ప్రతి ఒక్కరికీ గడప వద్దకే సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందిస్తున్నారని వివరించారు. గ్రామస్తులు మాట్లాడుతూ ఇంటి నుంచి బయటకు వెళ్లకుండా పథకాలను ఇళ్లకే పంపిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి నెలా ఒకటో తేదీన తెల్లవారక ముందే వలంటీర్లు వచ్చి పింఛను అందిస్తున్నారని, ఇదంతా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యమేనని పలువురు వృద్ధులు, దివ్యాంగులు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. రహదారుల సమస్యను కూడా త్వరలోనే పరిష్కరిస్తామని ఎమ్మెల్యే రమేష్‌బాబు గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి, సర్పంచి కొప్పనాతి శేషుబాబు, మండల కన్వీనర్ పరిశె మాధవరావు, జిల్లా రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వీరవెంకట నారాయణరావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ తోట నాంచారమ్మ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి

పేర్ని కిట్టు



పైప్ లైన్ పనులను ప్రారంభిస్తున్న పేర్ని కిట్టు

కోనేరుసెంటర్: గ్రామాల్లోని మారుమూల ప్రాంతాలకు సైతం మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కిట్టు అన్నారు. పోతేపల్లి పంచాయతీ శివారు చినపోతేపల్లి ఇందిరమ్మ కాలనీలో రూ. 10 లక్షల వ్యయంతో నిర్మించనున్న పైప్‌లైన్ పనులను శనివారం కిట్టు ప్రారంభించి మాట్లాడారు. గ్రామాలకు అవసరమైన సదుపాయాలను సమకూర్చేందుకు ప్రభుత్వంతో చర్చలు జరిపి నిధులు మంజూరు చేయిస్తున్న పేర్ని నానికి గ్రామస్తుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని గ్రామస్తులకు పిలుపునిచ్చారు. వసతుల కల్పనకు సంబంధించి ఎప్పుడు, ఎలాంటి సహాయం కావాలన్నా తమను సంప్రదించవచ్చన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు పిప్పళ్ల నాగబాబు, వైఎస్సార్ సీపీ బందరు మండల ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు నీలకంఠం వీరాంజనేయులు (అంజి), నాయకులు కాగిత ఏడుకొండలు, పామర్తి నాగేశ్వరరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణతో ఆరోగ్యం

బంటుమిల్లి: ఈ నెల 10వ తేదీన జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలల్లో విద్యార్థులకు ఆల్‌బెండాజోల్ మాత్రలు వేయాలని బంటుమిల్లి పీహెచ్‌సీ వైద్యులు వీకే పవన్‌కుమార్ అన్నారు. స్థానిక మండల రిసోర్స్ భవనం సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ఉపాధ్యాయులకు ఎంఈఓ వెంకటేశ్వరరావు సమక్షంలో నులి పురుగుల నివారణ మాత్రలు అందజేశారు. వైద్య సిబ్బంది, సీఆర్పీలు పాల్గొన్నారు. తొలుత వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.

మోపిదేవి: నులి పురుగుల నివారణ మాత్రలపై విద్యార్థులకు పూర్తిగా అవగాహన కల్పించాలని ఎంఈఓ ఎస్‌డీ సాగర్ అన్నారు. ఎంఈఓ కార్యాలయంలో ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. మోపిదేవి పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ ఎల్. లక్ష్మీనాథ్ మాట్లాడుతూ ఈనెల 10వ తేదీన అంగన్‌వాడీ, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేయాలని చెప్పారు. ఎంపీడీఓ రామలింగేశ్వరరావు, పీహెచ్‌సీ వైద్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెడన: నులి పురుగుల నివారణకు సంబంధించిన ఆల్‌బెండాజోల్ మాత్రలను పెడన పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పర్వేజ్ హైదర్ ద్వారా ఎంపీపీ రాజులపాటి వాణి ఎంఈఓ వైవీ హరనాథ్‌కు అందజేశారు. ఈ మందులను పాఠశాల విద్యార్థులకు తప్పనిసరిగా వేయాలని చెప్పారు.

చెత్త బుట్టల అందజేత..

మండలంలోని పంచాయతీలకు శనివారం ఎంపీపీ రాజులపాటి వాణి చెత్తబుట్టలను అందజేశారు. తడి, పొడి చెత్తకు సంబంధించి రెండు ప్లాస్టిక్ బుట్టలను పంచాయతీ కార్యదర్శులకు, సర్పంచులకు పంపిణీ చేశారు. పెడన మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు దావు భైరవలింగం, ఎంపీడీఓ వి. రెడ్డయ్య, ఈఓపీఆర్డీ జయరాం, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ..

కోనేరుసెంటర్: నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బందరు ఎంపీడీఓ బాలకృష్ణ వైద్య సిబ్బందికి సూచించారు. ఈ నెల 10వ తేదీన మండలంలో నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని పురస్కరించుకుని శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. చిన్నాపురం పీహెచ్‌సీ వైద్యురాలు నడకుదుటి నాగ నిఖిల మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి నులి పురుగుల నివారణ మాత్రలు అందేలా చూడాలన్నారు. డాక్టర్ రత్నగిరి, పీహెచ్‌సీ సూపర్‌వైజర్ ఎస్. రాంబాబు, ఎంపీహెచ్‌ఓ పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

చల్లపల్లి: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షులు డీడీసీ ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం డెప్యూటీ తహసీల్దార్ కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. జిల్లా నాయకులు కొండవీటి నాగరాజు, చల్లపల్లి మండల అధ్యక్షులు భోగాది వాసుదేవరావు, ప్రధాన కార్యదర్శి పాగోలు దుర్గాప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై శ్రద్ధ

పెడన: చిన్నారుల బంగారు భవిష్యత్‌కు తొలిగా బాటలు వేసుకునేందుకు అంగన్‌వాడీ కేంద్రాలు ఎంతగానో ఉపకరిస్తాయని, అలాగే గర్భిణులు, బాలింతలు ఆరోగ్యవంతులుగా ఉండటానికి కూడా దోహదపడుతున్నాయని మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి అన్నారు. శనివారం పట్టణంలోని ఏడో వార్డు వీరభద్రపురం కర్ణబత్తుల కల్యాణ మండలంలో తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని బాలింతలకు, గర్భిణులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందజేశారు. బంటుమిల్లి ప్రాజెక్టు సీడీపీఓ సముద్రవేణి, మున్సిపల్ కమిషనర్ బి. మహేంద్ర, కౌన్సిలర్లు రహిమతున్నీసా, కొసనం కరుణకుమారి, ఏసీడీపీఓ సుధారాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ప్రసన్న, శ్రావణికుమారి తదితరులు పాల్గొన్నారు.

మచిలీపట్నంటౌన్: రాష్ట్రంలోని మహిళల ఆరోగ్య పరిరక్షణకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతగానో కృషి చేస్తున్నారని డెప్యూటీ మేయర్ శీలం భారతి అన్నారు. మూడో డివిజన్ పెయింటర్స్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలు, గర్భిణులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను శనివారం ఆమె పంపిణీ చేసి మాట్లాడారు. నగరంలోని 28వ డివిజన్‌లో కార్పొరేటర్ షేక్ షాహినా, 29వ డివిజన్ కార్పొరేటర్ కట్టా కేదారేశ్వరరావు, 42వ డివిజన్ కార్పొరేటర్ చీలి రుచిత గర్భిణులు, బాలింతలకు సంపూర్ణ పోషణ కిట్లను అందజేశారు. ఆయా డివిజన్లలోని అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తల, ఆయాలు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

చల్లపల్లి: మండలంలోని అన్ని శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీఓ సీహెచ్ చినరాట్నాలు అన్నారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ కోట విజయ రాధిక అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జరిగింది. మంగళాపురం సర్పంచ్ డొక్కు నాగేశ్వరరావు, మాజేరు ఎంపీటీసీ సభ్యురాలు తమ్ము లక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్లు పాగోలు నాగ సీతారామారావు (ఫణి), పేరం నాగిరెడ్డి, ఎంపీటీసీ మాలెంపాటి శ్రీనివాసరావు డ్రెయినేజీ, విద్యుత్, ఇరిగేషన్, విద్య, వ్యవసాయ, వైద్య శాఖల అధికారులకు పలు సమస్యలపై ప్రశ్నల వర్షం కురిపించారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తామని అధికారులు బదులిచ్చారు. ఇక నుంచి సర్వసభ్య సమావేశంలో ప్రస్తావించే ప్రతి సమస్యను లిఖిత పూర్వకంగా సమావేశంలో అధికారులకు అందిస్తే పరిష్కారం వేగవంతం చేస్తామని ఎంపీడీఓ చినరాట్నాలు అన్నారు. సమావేశంలో తహసీల్దార్ కె.గోపాలకృష్ణ, ఈఓఆర్డీ అశోక్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

భవనాల నిర్మాణ లక్ష్యాల పూర్తికి చర్యలు

కలెక్టర్ రాజాబాబు



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ రాజాబాబు. చిత్రంలో జేసీ అపరాజితసింగ్

చిలకలపూడి(మచిలీపట్నం): ప్రాధాన్యత భవనాల నిర్మాణాలు పూర్తి చేసేందుకు నిర్దేశించిన రోజువారీ లక్ష్యాలను పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ పి. రాజాబాబు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి సచివాలయం నుంచి శనివారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గృహ నిర్మాణాలు, పంచాయతీరాజ్, జగనన్న సురక్ష, జగనన్నకు చెబుదాం, ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. జిల్లా ప్రగతిని కలెక్టర్ రాజాబాబు సీఎస్‌కు వివరించారు. జిల్లాలో ప్రాధాన్యత భవనాల నిర్మాణాలకు సంబంధించి 378 రైతు భరోసా కేంద్రాల భవనాలకు గానూ 103 భవనాలు పూర్తయ్యాయన్నారు. 268 వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలకు గానూ 70 భవనాలు పూర్తయ్యాయని, మిగిలిన భవనాల నిర్మాణాలను సెప్టెంబర్ లోగా పూర్తి చేస్తామని తెలిపారు. పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారులు నిర్మాణాలపై రోజువారీ లక్ష్యాలను నిర్దేశించుకుని పర్యవేక్షించి పూర్తి చేయాలన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో బడిఈడు పిల్లలను చేర్పించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇందుకోసం ప్రణాళికలు రూపొందించి అందరూ బడిలో ప్రవేశించేలా చూడాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్, డీఆర్వో వెంకటేశ్వర్లు, డ్వామా పీడీ సూర్యనారాయణ, డీసీఓ ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

లజ్జబండ మేజర్ డ్రెయిన్‌లో తూడు తొలగింపు

సాక్షి ఎఫెక్ట్



లజ్జబండ మేజర్ డ్రెయిన్‌లో తూడు తొలగించడంతో అడ్డంకులు లేకుండా పారుతున్న నీరు

బంటుమిల్లి: ముంజులూరు గ్రామ శివారు లజ్జబండ మేజర్ డ్రెయిన్‌లో నీటి ప్రవాహానికి అడ్డంకిగా ఉన్న తూడు, గుర్రపుడెక్కను శనివారం డ్రెయినేజీ అధికారులు తొలగించారు. లజ్జబండ మేజర్ డ్రెయిన్ పరీవాహక సాగు భూముల్లో నిలిచిన ముంపు నీటి సమస్యతో రైతులు పడుతున్న ఇబ్బందులపై సాక్షి కాంట్రాక్టర్ నిర్లక్ష్యం–రైతులకు శాపం శీర్షికన కథనాన్ని ఈ నెల 5వ తేదీన ప్రచురించింది. దీనిపై స్పందించిన పెడన సెక్షన్ డ్రెయినేజీ ఏఈఈ మురళీకృష్ణ డ్రెయిన్‌లో నీటి ప్రవాహానికి అడ్డంకిగా ఉన్న తూడు, గుర్రపు డెక్కను తొలగించేందుకు చర్యలు చేపట్టారు. వంతెన కింద కాంట్రాక్టర్ వదిలివేసిన మట్టి దిబ్బలు తొలగించే యంత్ర పరికరాలు డిపార్టుమెంట్ వద్ద లేవని, నీటి ప్రవాహం ఉన్నందున ఇప్పుడు తొలగించడం సాధ్యం కాదని రైతులకు తెలిపారు. సాక్షిలో వచ్చిన కథనంపై అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే శిక్షలు తప్పవు



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి కృష్ణయ్య

పెడన: ర్యాగింగ్‌కు పాల్పడినా, మాదక ద్రవ్యాలు వినియోగించినా కఠిన శిక్షలు అనుభవించాల్సి ఉంటుందని మచిలీపట్నం సీనియర్ సివిల్ జడ్జి కృష్ణయ్య అన్నారు. శ్రీ వాసవి ఇంజినీరింగ్ కళాశాలలో యాంటీ ర్యాగింగ్, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. న్యాయమూర్తి కృష్ణయ్య మాట్లాడుతూ జూనియర్ల విషయంలో సీనియర్లు ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన శిక్షలు తప్పదని హెచ్చరించారు. మాదకద్రవ్యాలు వినియోగించడం వల్ల మత్తుకు బానిసలవ్వడమే తప్ప చదువుపై శ్రద్ధ చూపలేరన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు భవిరి శంకరనాథ్, హరిబాబు, మునలయ్య, గోపీనాథ్, దేవిసాయి శ్రీవాణి, వెంకటరమణ, కళాశాల కరస్పాండెంట్ కె. కుమార్‌బాబు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు దోసపాటి బాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ బీఆర్ఎస్ రెడ్డి పాల్గొన్నారు.

పంటల బీమా ఉపయోగాలను వివరించండి

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలోని రైతులకు వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకానికి సంబంధించిన ఉపయోగాలను వివరించాలని వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ ఎన్. పద్మావతి అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశపు హాల్‌లో శనివారం వ్యవసాయ శాఖ, ప్లానింగ్ అధికారులకు పంటల బీమా పథకాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం రూపొందించిన సీసీఈఏ యాప్ ద్వారా వివరాలు అప్‌లోడ్ చేసి రైతులకు పంటల బీమా నమోదు చేసుకునేలా చూడాలని చెప్పారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా రైతు వేసిన పంట దెబ్బతింటే వెంటనే వారికి నష్టపరిహారం వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ప్రతి ఒక్క రైతు పంటల బీమా నమోదు చేసుకునేలా చూడాలని సూచించారు. సీపీఓ కె. బదరీ నారాయణ, వ్యవసాయ శాఖ డీడీ ఎస్‌వైవీఎస్ మనోహర్, ఉద్యాన శాఖాధికారి జె. జ్యోతి, విజయలక్ష్మీ, మణిధర్, కె. పద్మజ పాల్గొన్నారు.

పెన్షనర్ల వితరణ

మచిలీపట్నంటౌన్: 41వ డివిజన్ కుమ్మరిగూడెంకు చెందిన పింఛనుదారు కరప సాయికుమార్ ఇటీవల మృతిచెందారు. డివిజన్‌కు చెందిన పింఛనుదారులు ఒక్కొక్కరు రూ. 100 చొప్పున సేకరించిన రూ. 28 వేలను మృతుడి కుటుంబ సభ్యులకు మాజీ డెప్యూటీ మేయర్ లంకా సూరిబాబు సమక్షంలో అందజేశారు. అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ పిల్లాని శ్రీను, యర్రవరపు మాధవి నాయకులు పాల్గొన్నారు.